క్లుప్తంగా

27 నుంచి నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు


సీలేరులో నూకాలమ్మతల్లి అమ్మవారు

సీలేరు: కోరిన వరాలిచ్చు కొంగు బంగారంగా పేరుగాంచిన సీలేరులో నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 27 నుంచి 5 రోజుల పాటు జరగనున్నాయి. 27న అమ్మవారి గరగాలంకరణ, 29న కొత్త అమావాస్య రోజున ప్రధాన పండగ జరుగుతుందని, ఆ రోజు భక్తులు తమ మొక్కులు తీర్చుకోవచ్చునని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 30న అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి ఆలయ మహాద్వారం మూసి ఏప్రిల్ 1వ తేదీన భక్తులకు అమ్మవారి పునః దర్శనం కల్పిస్తామని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి


వీడ్కోలు సభలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం సీలేరులో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఈ ఏడాది 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం హాల్ టికెట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, పాఠశాల కమిటీ చైర్మన్, సర్పంచ్ దుర్జో, ఉప సర్పంచ్ వల్లీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం 'మీ కోసం'

జి.మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం భవనంలో ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 'మీ కోసం '(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ జి.రాజ్‌కుమార్, ఎంపీడీవో తేజరతన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు అందరూ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని చెప్పారు. మీ కోసం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

చికిత్స పొందుతూ గిరిజనుడి మృతి


మృతుడు సింహాచలం (ఫైల్)

జి.మాడుగుల: భీరం పంచాయతీ అనర్భ గ్రామానికి చెందిన గిరిజనుడు బద్నాయిని సింహాచలం(34) తీవ్ర అస్వస్థతకు గురై విశాఖపట్నం మానసిక వైద్యాలయంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతిని బంధువుల అందించిన వివరాలిలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం భీరం పంచాయతీ అనర్భ గ్రామానికి చెందిన సింహాచలం మానసిక పరిస్థితి బాగోకపోవడంతో మంగళవారం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం మెంటల్ ఆస్పత్రికి తరలించారు. సింహాచలం చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

నాతవరం: ప్రమాదశావత్తు ట్రాక్టర్ బోల్తా పడి సంఘటనా స్థలంలోనే డ్రైవర్ మరణించాడు. నాతవరం ఎస్ఐ సీహెచ్ భీమరాజు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన పెదపాత్రుని సత్యనారాయణ (59) శుక్రవారం సాయంత్రం తన గ్రామం నుంచి వరి గడ్డి ట్రాక్టరుపై నాతవరం మండలం గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం గ్రామానికి వచ్చాడు. ఈ గ్రామంలో వరి గడ్డి అన్‌లోడ్ చేసి తిరిగి స్వగ్రామం అల్లిపూడి ట్రాక్టరుపై వెళ్లిపోతున్నాడు. చిక్కుడుపాలెం గ్రామ సమీపంలో రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పి ట్రాక్టరు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ సంఘటనా స్థలంలోనే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పిల్లలు చదువుకుంటున్నారు. ఇంకా వివాహం కాలేదు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్యాపిల్లలు బోరున విలపిస్తున్నారు. మృతుడి కుమార్తె నాగమణి ఫిర్యాదు మేరకు నాతవరం ఎస్ఐ సీహెచ్ భీమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

విలీన మండలాల విద్యార్థులు 1420 మంది సన్నద్ధం

సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు


కూనవరం సెంటర్ ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరుస్తున్న అధికారులు

కూనవరం: పదో తరగతి పరీక్షల నిర్వహణకు విలీన మండలాల్లో అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షలకు కూనవరం, వీఆర్ పురం, చింతూరు, ఎటపాక మండలాల్లోని 36 పాఠశాలలకు చెందిన 1420 మంది విద్యార్థిని, విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. వీరంతా 10 కేంద్రాల్లో ఈ పరీక్షలు రాయనున్నారు. కూనవరంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, నర్సింగపేటలో ఆశ్రమ హైస్కూల్, వీఆర్‌పురం మండలంలో జెడ్పీ హైస్కూల్, సున్నవారిగూడెం ఆశ్రమ హైస్కూల్, చింతూరు మండలంలో జెడ్పీ హైస్కూల్, ఏపీటీడబ్ల్యూఆర్ గురుకులం, మోతుగూడెంలో జెడ్పీ హైస్కూల్, నరసింహాపురం ఏహెచ్ఎస్ హైస్కూల్, ఎటపాక మండలంలో కొత్తూరు నారాయణపురం జీటీడబ్ల్యూ ఏహెచ్ఎస్ హైస్కూల్, గౌరిదేవిపేట జెడ్పీ హైస్కూల్ కేంద్రాలుగా పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు 10 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 10 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 79 మంది ఇన్విజిలేటర్లు, కేంద్రానికి ఇద్దరు చొప్పున ప్రత్యేకాధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ కింద నాలుగు మండలాల నుంచి నలుగురు ఎంఈవో–2లు, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. సమస్యాత్మక కేంద్రాల్లో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు పంపించిన ప్రశ్నాపత్రాలను సంబంధిత స్థానిక పోలీస్ స్టేషన్లలో భద్రపరిచామని ఎంఈవో-1 వి.వి.లక్ష్మీనారాయణ తెలిపారు.

అడ్డతీగలలో రెండు పరీక్ష కేంద్రాలు

అడ్డతీగల: పదో తరగతి పరీక్షల నిర్వహణకు అడ్డతీగలలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి నిర్వహించనున్న పరీక్షలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రాలుగా విద్యార్థులకు కేటాయించినట్టు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. 364 మంది విద్యార్థులు ఐదు ఆశ్రమ పాఠశాలలు, నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చి పరీక్షలు రాస్తారన్నారు. ఇందు కోసం ఆశ్రమ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఎనిమిది గదులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 గదులు కేటాయించామన్నారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి 8 మంది ఇన్విజిలేటర్లు, ఒక రిలీవర్ చొప్పున రెండు చోట్ల కలపి 18 మందిని నియమించామన్నారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యా శాఖాధికారి కె.కృష్ణమూర్తి తెలిపారు. మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం మూడు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సీఏహెచ్ బాలుర పాఠశాల పరీక్ష కేంద్రంలో 170 మంది, సీఏహెచ్ బాలికల పాఠశాల పరీక్ష కేంద్రంలో 160 మంది, జోలాపుట్టు జెడ్పీ పాఠశాలలో 160 మంది చొప్పున మొత్తం 490 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నారని చెప్పారు. జోలాపుట్టు పరీక్ష కేంద్రాన్ని సమస్యాత్మక కేంద్రంగా గుర్తించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

భయం వీడి ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయండి


బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి


బాలుర ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎంతో మాట్లాడుతూన్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ: పదో తరగతి విద్యార్థులు భయాన్ని వీడి ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని అరకులోయ సీఐ హిమగిరి సూచించారు. డుంబ్రిగుడలో పరీక్షలు జరిగే ప్రభుత్వ ఉన్నత, బాలుర గిరిజన ఆశ్రమ, బాలికల పాఠశాల కేంద్రాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. సౌకర్యాలపై ఆరా తీశారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా చూడాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే ఉన్నత చదువుకు ప్రణాళిక వేసుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని, సైబర్ క్రైం జోలికి పోవద్దని విద్యార్థులకు హితవు పలికారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


హుకుంపేట: గ్రామాల్లో రహదారి సమస్యల పరిష్కారానికి దృష్టి పెడుతున్నామని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాకరి బొంజుబాబు తెలిపారు. మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ మత్స్యపురం జంక్షన్ నుంచి సాలేపు గొంది వరకు ఎంపీపీ కూడా రాజుబాబు చొరవతో మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో మంజూరైన మెటల్ రోడ్డు నిర్మాణ పనులకు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్, నాయకులు వెంకట్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం ఎమ్మెల్యే తీరు హాస్యాస్పదం


సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు

ఉక్కునగరం: గిరిజనేతరులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని అసెంబ్లీ వేదికగా రంప చోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కోరడం హాస్యాస్పదమని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు ఉక్కునగరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్టీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శిరీషాదేవి గిరిజనులపై తనకున్న వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వైఖరిని తాము ఖండిస్తున్నామని చెప్పారు. సమావేశంలో సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోడంరాజు, నాయకులు దేవినాయుడు, నారాయణమూర్తి, కల్యాణ్ పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న తిరు కల్యాణం


స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఎటపాక: గోవిందుని నామస్మరణతో వేంకటేశ్వర స్వామి ఆలయాలు మార్మోగాయి. వెంకటరెడ్డిపేటలో కొలువైన అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం హోలీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు సరిహద్దున ఉన్న తెలంగాణా నుంచి కూడా సుమారు వేలాది మంది భక్తులు తరలివచ్చి ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం నుంచి అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామిని పల్లకిపై ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపానికి వేద మంత్రోచ్చారణల నడుమ తీసుకొచ్చారు. అలివేలు మంగ, పద్మావతి, వేంకటేశ్వరస్వామివారికి జీలకర్ర, బెల్లం పెట్టిన తర్వాత మాంగల్య ధారణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతన వధూవరులు తలంబ్రాలు పోసుకునే తంతుకూడా కనుల విందుగా జరిగింది. నూతన వధూవరులకు వేలాది మంది భక్తులు కట్న కానుకలు సైతం సమర్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కల్యాణ తంతును అర్చకులు గొట్టుపుళ్ల రాజగోపాల్‌చార్యులు, చక్రవర్తుల రఘునాథాచార్యులు, భరద్వాజ ఆచార్యులు నిర్వహించారు.

జన్‌మన్ గృహాలకు రూ.10లక్షలు మంజూరు చేయాలి


జబడలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

ముంచంగిపుట్టు: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పీఎం జన్‌మన్ గృహాలకు రూ.10 లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. లక్ష్మీపురం పంచాయతీ జబడ గ్రామంలో శుక్రవారం సీపీఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీలకు పీఎం జన్‌మన్ ద్వారా అందిస్తున్న రూ.3.39 లక్షలు సరిపోవడం లేదన్నారు. ప్రసుత్తం అన్ని రకాల నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో ఇంటి నిర్మాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇతర తెగలకు అందిస్తున్న రూ.2.55 లక్షలతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గోపాల్, గురు, సోద, డోంబ్రు, మోహన్, బలరాం పాల్గొన్నారు.

హోలీ.. ఆనందాల కేళీ


ముంచంగిపుట్టులో రంగులు పూసుకుని సందడి చేస్తున్న యువత, చిన్నారులు


ఉట్టి కొట్టే కార్యక్రమంలో పోటీ పడుతున్న యువకులు


డుంబ్రిగుడలో రంగునీళ్లు పోసుకుంటున్న చిన్నారులు


రాజవొమ్మంగిలో హోలీ ఆటల్లో సందడి చేస్తున్న చిన్నారులు

ముంచంగిపుట్టు: హోలీ వేడుకలను గిరిజనులు శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు కొండపడ, దారెల, జోలాపుట్టు గ్రామాల్లో గురువారం రాత్రి రాధాకృష్ణుల విగ్రహాలకు గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. థింసా నృత్యాలు చేసి సందడి చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం కొండపడ, దారెల గ్రామాల్లో కర్రలు కాల్చే ఉత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యల్లో భక్తులు పాల్గొని ఈ వేడుకలను తిలకించారు. పలు గ్రామాల్లో రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ముంచంగిపుట్టులో యువకులంతా ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఎంతో ఉత్సాహంగా ఉట్టికొట్టేందుకు పోటీ పడ్డారు.

సీలేరు: సీలేరులో హోలీ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. దుర్గావీధి, అల్లూరివీధి, శివాలయం వీధులలో పిల్లలు రంగులతో కేరింతలు కొట్టారు. సీలేరు యూత్ ఆధ్వర్యంలో ప్రధాన మార్కెట్‌లో యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సందడి చేశారు. దారకొండ, దుప్పులవాడలలో హోలీ వేడుకల్లో యువకులు, చిన్నారులు రంగులు చల్లుకున్నారు.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: మండలంలో హోలీ పండగ సంబరాలను చిన్నారులు, యువత రంగులు చల్లుకుంటూ, రంగునీళ్లు పోసుకుంటూ ఆనందంగా జరుపుకొన్నారు. విద్యార్థులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. డుంబ్రిగుడ, అరకు, కించుమండ, గుంటసీమ, సొవ్వా తదితర గ్రామాల్లో గిరిజనులు వైభవంగా హోలీ నిర్వహించారు.

రాజవొమ్మంగి: స్థానిక వాల్మీకినగర్‌లో చిన్నారులు శుక్రవారం ఒకరిపై ఒకరు రంగులు పూసుకుంటూ హోలీ ఆడారు. పాఠశాలలకు సెలవు ఇవ్వడంతో పిల్లలంతా వీధుల్లో తిరుగుతూ సందడి చేశారు.

బోయవాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చేందుకు కుట్ర


సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల కార్యదర్శి నర్సయ్య

ముంచంగిపుట్టు: బోయవాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎం.శ్రీను, కె.నర్సయ్య అన్నారు. ముంచంగిపుట్టులో శుక్రవారం గిరిజన సంఘం నేతల సమావేశం జరిగింది. పార్లమెంట్ సమావేశంలో తెలంగాణ బీజేపీ ఎంపీ డి.కె.అరుణ బోయవాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చాలని వ్యాఖ్యానించడాన్ని గిరిజన సంఘం నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎం.ఎం.శ్రీను, కె.నర్సయ్య మాట్లాడుతూ అధికారంలో ఉంటే గిరిజనులకు వ్యతిరేకంగా, అధికారంలో లేకపోతే గిరిజనులకు అనుకూలంగా టీడీపీ, బీజేపీలు పని చేస్తున్నాయని ఆరోపించారు. గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులకు ఇళ్లు మంజూరు చేయడం అంటేనే గిరిజన చట్టాలు, హక్కులకు తూట్లు పొడవడమేనని చెప్పారు. రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు సరికాదని, దీనిని గిరిజన సంఘం ఖండిస్తుందన్నారు. గిరిజన చట్టాల జోలికి వస్తే ప్రతిఘటన తప్పందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు నగేష్, నారాయణ, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట


ఆలయంలో విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

చింతపల్లి: చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ కేంద్రంలో నిర్మించిన సీతారాముల ఆలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. సీతారాముల విగ్రహ ప్రతిష్ట వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగింది. పంచాయతీ సర్పంచ్ చింతర్ల సునీల్ దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ యాగశాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషాదేవి, వర్తక సంఘం నాయకులు బేతాళుడు, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, సత్యారావు, వెంకటేష్, సాగర్, సతీష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మి యాగ అగ్ని ప్రతిష్ట


యాగశాలలో అగ్నిప్రతిష్టాపన చేస్తున్న రుత్వికులు

ఎటపాక: ఉప్పగుండాల వద్ద జరుగుతున్న 23వ శ్రీఅష్టలక్ష్మి యాగం మూడో రోజు శుక్రవారం అగ్నిప్రతిష్టాపనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీఅష్టలక్ష్మి పీఠాధిపతి పీతాంబరం రఘునాథాచార్య స్వామి పర్యవేక్షణలో యాజ్ఞాచార్య రఘుపుంగవాచార్యులు, పాడిచేటి రామచంద్రాచార్యులు, గొట్టుపుల్ల సీతారామచార్యులతో పాటు వివిధ పుణ్యక్షేత్రాల నుంచి వచ్చిన రుత్వికులతో ఈ అగ్ని ప్రతిష్ట జరిగింది. తొలుత విష్వక్సేన, పుణ్యాహవచనం పూజలు చేశారు. అనంతరం అరణి(చెక్క) తీసుకుని వేదమంత్రాల నడుమ అగ్ని మథనం చేశారు. ప్రజ్వరిల్లిన అగ్ని దేవుడిని ఆయా గుండాలలో ప్రతిష్ఠించారు. అదే విధంగా అమ్మవారి మూల మంత్ర హవనం, భక్తులతో కృష్ణాష్టకం పఠనం జరిపించారు. సాయంత్రం యాగశాల ఆరాధనల్లో భాగంగా సామూహిక విష్ణు సహస్ర నామపారాయణం చేశారు. ఈ కార్యక్రమాల్లో యాగం నిర్వాహకులు కొండిశెట్టి నాగేశ్వరరావు, గాదె మాధవరెడ్డి, భాస్కరరావు, రామిరెడ్డి, కంభంపాటి సురేష్, నగేష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన పోస్టుమన్‌కు సన్మానం


రిటైర్డ్ పోస్ట్‌మన్ సూర్యనారాయణను

రాజవొమ్మంగి: స్థానిక సబ్ పోస్టాఫీస్ పరిధిలో పని చేస్తున్న అమ్మిరేఖల పోస్ట్‌మన్ ఆశపు సూర్యనారాయణ శుక్రవారం పదవీ విరమణ చేశారు. స్థానిక సబ్‌పోస్టాఫీస్‌లో జరిగిన వీడ్కోలు సభలో ఆయనను తోటి ఈడీ ఉద్యోగులు సత్కరించారు. దాదాపు 36 సంవత్సరాల పాటు రాజవొమ్మంగికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలోని ఐదు గ్రామాల ప్రజలకు కాలినడకన వాగులు, వంకలు దాటుతూ సేవలందించిన సూర్యనారాయణ ధైర్యసాహసాలను ఐపీవో బ్రహ్మంనాయక్(పెద్దాపురం), పోస్టుమాస్టారు ప్రేమ్‌కుమార్ కొనియాడారు. వర్షాకాలంలో విపరీతంగా పొంగి ప్రవహించే వాగులను లెక్కచేయకుండా తన విధి నిర్వహణ కొనసాగించారని, సర్వీసులో ఎక్కడా రిమార్కు లేకుండా పని చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీతారామరాజు, సుబ్బరాజు, అప్పారావు, రమణ, అప్పలకొండ పాల్గొన్నారు.

గిరిజన రైతులకు స్ప్రేయర్ల పంపిణీ


రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి

రంపచోడవరం: రంపచోడవరం హెచ్ఎన్‌టీసీ నర్సరీలో శుక్రవారం గిరిజన రైతులకు జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్సిడీపై అందించే వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఉద్యాన శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది చిట్టిబాబు, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, సబ్ అసిస్టెంట్లు అబ్బాయిరెడ్డి, నూకరాజు, నాగరాజు, తెలుగు అధ్యక్షుడు కారం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే బకాయిలు చెల్లించాలి


కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు రాజు, ప్రసన్న

నర్సీపట్నం: ఉపాధి కూలీల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. రావణాపల్లి రిజర్వాయర్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సీఐటీయూ బృందం పరిశీలించి కూలీల ఇబ్బందులను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆరు వారాలుగా కూలీ డబ్బులు చెల్లించకపోతే వారు ఏ విధంగా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేయడమే బీజేపీ లక్ష్యమన్నారు. వేసవి ప్రారంభమైనా పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయలేదన్నారు. రవాణా, మంచినీటి సౌకర్యం కల్పించలేదన్నారు. సక్రమంగా పనిదినాలు కల్పించటంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. రోజువారి కూలీ రూ.600కు పెంచి, 200 పని దినాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కె.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా


డిపో గేటు వద్ద ప్లకార్డులతో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నర్సీపట్నం: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ డిపోకు చెందిన ఎన్ఎంయూఏ ఉద్యోగులు భోజన విరామ సమయంలో డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.ఎస్.రాజు, డిపో ప్రెసిడెంట్ శంకర్రావు, కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని డిపోల సమస్యలపై డీపీటీవో మొండి వైఖరి విడనాలన్నారు. మహిళా కార్యకర్తలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.